ప్రజాశక్తి

మంగళవారం 12 డిసెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

వైసిపిలో భారీ మార్పులు

- కొండపి ఇన్‌ఛార్జిగా మంత్రి ఆదిమూలపు సురేష్
- సంతనూతలపాడుకు ఇన్‌ఛార్జిగా మంత్రి మేరుగ నాగార్జున
- అద్దంకిలో పోటీచేయనున్న వైవి అనుచరుడు హనిమిరెడ్డి
- వేమూరుకు వరికూటి అశోక్‌బాబు..
- టిజెఆర్‌కు నోఛాన్స్

మంత్రి సురేష్ | మంత్రి నాగార్జున | హనిమిరెడ్డి | అశోక్‌బాబు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అనుకున్నదే జరిగింది. వైసిపిలో భారీ మార్పులు జరిగాయి. తెలంగాణా ఎన్నికల ప్రభావం స్పష్టంగా కనిపించింది. సిట్టింగులకు స్థానచలనంతో పాటు కొందరికి టిక్కెట్లు కూడా గల్లంతయ్యాయి. ఇద్దరు మంత్రుల స్థానాలే మారిపోయాయి. సర్వేల నివేదికలే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. సిట్టింగు స్థానాల్లో కొనసాగిస్తే గెలుపుపై నమ్మకం లేకనే ఈ మార్పులు చేశారనే చర్చ సాగుతోంది. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ మార్పులు జరిగాయి. పార్టీ అధిష్టానం సోమవారం సాయంత్రం ▶ 2లో



జేసీకి అర్జీ ఇస్తున్న సిపిఎం నేతలు

పంట నష్టానికి

ప్రజాప్రతినిధుల వైఫల్యమే కారణం

సిపిఎం

3.33 లక్షల ఎకరాల్లో పంట నష్టం

▶ 3లో

వైసిపిలో భారీ మార్పులు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన పలు మార్పులు చేర్పులు ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోనూ ఉన్నాయి. వైపాలెం నుంచి మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్‌ను కొండపి ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈయన ఇక్కడే ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. వైపాలెంలో ఎవరన్నదీ ఇంకా స్పష్టతకు రాలేదు. సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మంత్రి మేరుగ నాగార్జునను నియమించారు. ఇక్కడ ఈయనే వైసిపి నుంచి బరిలోకి దిగనున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ఎక్కడనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయనకు టిక్కెట్టుపై ఆశలు గల్లంతయినట్లే.. అద్దంకి ఇన్‌ఛార్జిగా ఉన్న బాచిన చైతన్యను తప్పించారు. ఆయన స్థానంలో వైవి.సుబ్బారెడ్డి అనుచరుడు పాణెం హనిమిరెడ్డిని నియమించారు. కొంతకాలంగా ఈయన పేరును అధిష్టానం పరిశీలనలో పెట్టింది. అద్దంకి వైసిపి అభ్యర్థిగా హనిమిరెడ్డి పోటీలో ఉంటారు. బాపట్ల జిల్లా రేపల్లె ఇన్‌ఛార్జిగా ఈపూరు గణేష్‌ను నియమించారు. ఈయన మాజీ మంత్రి సీతారావమ్మ కుమారుడు. ఈ మార్పులు జిల్లాలో చర్చకు దారితీస్తున్నాయి. మిగతా స్థానాల్లో మార్పులు ఎలా ఉంటాయనేదీ ఇప్పుడు ఉత్కంఠగా మారింది.ఎవరికి తిరిగి టిక్కెట్టు దక్కుతుంది? ఎవరికి పోతుందనే ఆందోళన పెరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశంలో నాలుగు స్థానాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అభ్యర్థులు వారేనని తేలిపోయింది. జిల్లాలో మిగతా స్థానాల్లో నేరుగా అభ్యర్థులనే ప్రకటించే అవకాశాలున్నాయి. ఏదేమైనా భారీ మార్పులు తథ్యమయ్యాయి. అద్దంకి ఇన్‌ఛార్జి బాచిన చైతన్యను తప్పించడంపై వైసిపి వర్గాల్లో చర్చ సాగుతోంది. అద్దంకిలో గరటయ్య వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంది. ఇప్పుడు చైతన్య ఏ నిర్ణయం తీసుకుంటారనేదీ చూడాలి. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు పరిస్థితి ఏమిటన్నదీ చూడాలి. ఆయనకు ఎక్కడా ఇన్‌ఛార్జిగా అవకాశం రాలేదు. అంటే పోటీ నుంచి దాదాపుగా తప్పించినట్లేనని స్పష్టమవుతోంది.

పూజలు నిర్వహిస్తున్న దామచర్ల జనార్ధన్ దంపతులు

దామచర్ల దంపతుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం పట్టణంలోని శ్రీబాల త్రిపురసుందరి దేవి, త్రిపురాంతకేశ్వర ఆలయాలను ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్‌రావు, ఆయన సతీమణి నాగసత్యలత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు దామచర్ల దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

కొండపి : రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని పిడిఎస్‌యు జిల్లా మాజీ నాయకుడు ఆర్.మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో పిడిఎస్‌యు కొండపి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం అనే అంశంపై సోమవారం సెమీనార్ నిర్వహించారు. సెమినార్‌కు పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి సిసింద్రి బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ పిడిఎస్‌యు 23వ రాష్ట్ర మహాసభలు ఈనెల 15,16,17 తేదీల్లో నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సివైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగరాజు, పిడిఎస్‌యు మండల నాయకులు నాని, గణేష్ , అనిల్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు భవనంలో కార్యదర్శులు, వాలంటీర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేవంలో ఇఒఆర్‌డి ఈదుల రాజశేఖర్, ఎంఇఒలు ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** మండలంలో ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ నాసర్‌రెడ్డి, ఎంఇఒ మస్తాన్ నాయక్ కోరారు. స్థానిక ఆర్‌డిటి ఆడిటోరియంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పిఇటిలతో సోమవారం సమావేశం నిర్వహించారు. **గిద్దలూరు రూరల్ :** ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 3 వరకూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ హేమలత దేవి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లు, పీడీలు, పిఇటిలకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యతో తో పాటు ఆరోగ్యవంతమైన జీవనం కోసం సచి వాలయ, మండల స్థాయి, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో నగర పంచాయతీ కమిషనర్, ఎంఇఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ నాగేశ్వరప్రసాద్

పంట నష్టం అంచనాల సర్వేను

18 లోపు పూర్తి చేయాలి : జేసీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పంట నష్టం అంచనాల సర్వే ప్రక్రియను ఈ నెల 18లోగా పూర్తి చేయాలని, నష్టపోయిన రైతుల వివరాలను సచివాలయాల వద్ద ఈ నెల 22వ తేదీ నాటికి ప్రదర్శించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని పరిశీలన, మరికొన్నింటిని విచారించాలంటూ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తుపాన్‌తో దెబ్బతిన్న పంటల నష్టం అంచనాల సర్వే పక్కాగా ఉండాలన్నారు. పంటల నష్టం అంచనాల సర్వేలో విఆర్‌ఓ, విఆర్‌ఏలు పాల్గొనాలన్నారు. అభ్యంతరాల స్వీకరణ తదుపరి 26వ తేదీన తుది జాబితా విడుదల చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ జి.రవీందర్ పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తికి గొప్ప విలువుంది : జేసీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

న్యాయవాద వత్తికి సమాజంలో గొప్ప విలువ ఉందని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. అలాంటి వత్తిని చేపట్టిన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. వైఎస్ఆర్ లా నేస్తం ఆర్థిక సహాయం నగదు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ లోని డి.ఆర్.సి. సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ లాంఛనంగా చేపట్టారు. జిల్లాలో లబ్ధిదారులైన జూనియర్ లాయర్లకు బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతితో కలసి శాసన మండలి సభ్యులు పోతుల సునీత చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జె. రాజదిబోరా, జూనియర్ లాయర్లు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న జేసీ, ఎమ్మెల్యే

నేడు వికసిత భారత్ సంకల్పయాత్ర

టంగుటూరు: మండల పరిధిలోని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి నర్రా జగదీష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ కార్యదర్శిగా 'చీదెళ్ల'

యర్రగొండపాలెం : ఎపి ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ కార్యదర్శిగా యర్రగొండపాలెంకు చెందిన డాక్టర్ చీదెళ్ళ నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ తిథివీథి ప్రకాష్‌రావు, కోశాధికారి ముదునూరు శ్రీనివాసరావు చేతులు మీదుగా నాగేశ్వరరావు నియామక పత్రం అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

దాతృత్వాన్ని చాటుకున్న డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

పేద విద్యార్థి వైద్య విద్యను ప్రోత్సహిం చేందుకు మార్కాపురం పట్టణంలోని శ్రీ కందుల ఓబులరెడ్డి హాస్పటల్ అధినేత డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి తన దాతృ త్వాన్ని ప్రదర్శించారు. కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన చౌడూరి నాగిరెడ్డి, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమారుడు రాజేశ్వరరెడ్డి గుంటూరులోని వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. తండ్రి నాగిరెడ్డి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రాజేశ్వరరెడ్డి చదువుకు ఉపయోగపడే విధంగా అన్ని సాఫ్ట్‌వేర్లు కలిగిన ఖరీదైన ల్యాప్‌టాప్‌ను 'కందుల ఓబులరెడ్డి హాస్పిటల్' చైర్మన్ డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

ల్యాప్ టాప్ అందజేస్తున్న డాక్టర్

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఈ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీధర్ నాయుడు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఎస్.రమేష్ సోమవారం తెలిపారు. స్కిల్ హబ్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ప్రస్తుత డిమాండ్ ఉన్న కోర్సులలో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిని అభ్యర్థులు 9949414337, 998541 9272 నంబర్లను సంప్రదించాలన్నారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయితీ పరిధిలో పారిశుధ్యం మెరుగుదలకు కృషి చేస్తున్నట్లు సర్పంచి రామావత్ అరుణాబాయి తెలిపారు. ఇటీవల తుపాను కారణంగా కురిసిన వర్షాలకు డ్రైనేజీల్లో నిలిచిపోయిన చెత్తా చెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. సర్పంచి దగ్గరుండి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సంధ్భంగా అరుణాబాయి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు ప్రభలకుండా ఉంటాయన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తా చెదారాన్ని బయట పడేయకుండా చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు.

డస్ట్ బిన్నులు అందజేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల సచివాలయ వద్ద తడి, పొడి చెత్తల సేకరణకు అవసరమైన డస్ట్ బిన్నులను సర్పంచి చిత్తూరి హారిక చేతులు మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి హారిక మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తలను రోడ్లపై పడవేయకుండా చెత్తబండి తమ ఇంటి ముందుకు వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.251/2012

షేక్.పీర్ల మస్తాన్ వలి - వాది
వర్సెస్
1. **షేక్ ఖాసీం పీరా** (డైడ్)
& వగైరా - ప్రతివాదులు

టు,
D2. **షేక్.ఖాసీం భీ,** భర్త లేట్ **ఖాసీం పీరా,**
D4. **షేక్.నాయబ్,** తండ్రి లేట్ **ఖాసీం పీరా,** టకారిపాలెం, కనిగిరి మున్సిపాలిటీ, ప్రకాశం జిల్లా.
D5. **షేక్.మహబూబ్ బాషా @ జల్సా,** తండ్రి లేట్ ఖాసీం పీరా, మసీద్ దగ్గర, ఉదయగిరి టౌన్ & మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై నెంబర్ దావాలో మీరు ప్రతివాదులుగా ఉన్నారు. మీరు పై కోర్టు నుండి అనేక సార్లు వాది నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ నోటీసును పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియచేయమని ఉత్తర్వులు వేసి, పై నెంబర్ దావా ను **తేది:14-12-2023** కి వాయిదా వేసివున్నారు. కావున ఆ దినము **ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది: **14-12-2023**

ఇట్లు
చిడిపోతు హరికృష్ణ
న్యాయవాది, కందుకూరు.

గ్రామకంఠంలో 'దాదా' పాగా

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం కంకణంపాడు గ్రామం నడిమధ్యలో ఉన్న గ్రామ కంఠం స్థలాన్ని ఓ 'దాదా' ఆక్రమించాడు. అదేమిటని అడిగిన గ్రామస్తులతో మీ దిక్కున్నచోట చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడు. అతని చెర నుంచి గ్రామకంఠం స్థలాన్ని కాపాడాలని గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఎంపిడిఒకు, తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కంకణంపాడు గ్రామ నడిబొడ్డులో మొదట్లో ఓ బావి ఉండేది. ఆ బావిని తాగునీటి కోసం, గ్రామస్తులు పీర్ల పండగ చేసుకుని పీర్లు కడుగుకొనేందుకు ఉపయోగించేవారు. కొంతకాలమైన తర్వాత ఆ బావిలో నీరులేక నిరుపయోగంగా మారింది. అనంతరం 2017వ సంవత్సరంలో గ్రామస్తుల కోరిక మేరకు ఆ బావిని పూడ్చివేశారు. అప్పటి నుంచి ఆ ఖాళీ స్థలంలో గ్రామస్తులు శుభకార్యాలకు వంటలు చేసుకునేందుకు వినియోగిస్తున్నారు. కానీ ఆ స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన రియల్టర్ దాదా పుల్లారావు ప్రతిరోజూ కారు పార్కింగ్‌కు వినియోగించుకునే వాడు. ఈ విషయంపై గ్రామస్తులు అడుగగా మీరు ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు ఖాళీ చేస్తానని, ఖాళీగా ఉంది కాబట్టి కారు పార్కింగ్ చేసుకుంటున్నానని నమ్మబలికాడు.

ఆక్రమించుకున్న స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు

కానీ ఇటీవల కాలంలో అతడు తన తమ్ముడైన దాదా భాస్కర్ చేత ఆ స్థలంలో ఒక బంకును ఏర్పాటు చేయించి రేకుల షెడ్డు నిర్మించాడు. సర్వే నంబర్ 337/2లో రూ.10 లక్షల విలువ చేసే నాలుగు సెంట్ల భూమి ఆక్రమించారనే విషయంపై గ్రామస్తులు నిలదీయగా 'స్థలాన్ని ఖాళీ చేయనని, అవసరమైతే ఇల్లు కూడా కట్టుకుంటానని, మీకు

కంకణంపాడు గ్రామంలో గ్రామకంఠం ఆక్రమణపై ఎంపీడీవో సుకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

చేతనైంది చేసుకోండని చెప్పి తమపై వాదనకు దిగాడని చిలకల లక్ష్మిరెడ్డి, కారుమంచి సిద్దయ్య, కారుమంచి బాలనాసర్, బొప్పరాజు లక్ష్మీనారాయణ, కారుమంచి బాలమీరయ్య, షేక్ ఖాసిం, కారుమంచి హాజరత్, కారుమంచి దస్తగిరిలు స్థానిక తహశీల్దార్ ఎన్ వాసు, ఎంపిడిఒ సుకుమార్‌లకు శుక్రవారం గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించి ఒక వ్యక్తి ఆక్రమించిన గ్రామ కంఠాన్ని ఖాళీ చేయించి, ఆ స్థలం గ్రామస్తులందరికీ ఉపయోగపడేలా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వెలిగండ్ల

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు జరిగింది. వివరాల్లోకెళితే.. వెలిగండ్ల మండలం నర్సమాంబపురం గ్రామానికి చెందిన ఉండేలా నారాయణరెడ్డి(57) తన స్వగ్రామమైన నరసమాంబపురం నుంచి సిఎస్ పురంలో కోత మిల్లు వద్ద ఇంటికి సంబంధించిన సామాన్లు కోయించుకోవడానికి తన ఇంట్లో ఉన్న మొద్దులను ట్రాక్టర్లో వేసుకొని తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఇంటి నుంచి సిఎస్ పురం బయలుదేరాడు. మార్గమధ్యంలో మొగల్లూరు, మారపగుంట్ల మధ్యలో ట్రాక్టర్ ముందున్న లైట్లు ఆగిపోవడంతో ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలబెట్టి లైట్లకు ఫీజులు వేసుకుంటుండగా వెనుక నుంచి భారీ క్రేన్ వచ్చి ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి ఢీకొంది. దీంతో ముందు వైపున లైట్లు బాగా చేసుకుంటున్న నారాయణరెడ్డికి ట్రాక్టర్ బలంగా తగలటంతో కిందపడిపోగా ట్రాక్టర్ పైకెక్కి తలభాగం బాగా దెబ్బతింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు పోలీసులకు ఫిర్యాదు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉండేల నారాయణరెడ్డి

చేయడంతో ఆ భారీ క్రేన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు బంధువు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి మహేష్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరికి తరలించారు. ఈ ప్రమాదం జరగటంతో నరసమాంబ గ్రామంలో విషాద ఛాయలు అనుముకున్నాయి. మృతుడు నారాయణరెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు.

భైరవకోనలో భక్తుల సందడి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసంలోని చివరి సోమవారం కావడంతో జిల్లాలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వైఎస్ఆర్ కడప జిల్లా, గుంటూరు జిల్లాలకు చెందిన భక్తులు సోమవారం భైరవకోనకు విచ్చేశారు. అక్కడ జలపాతం వద్ద స్నానాలు చేసి త్రిముఖ దుర్గాదేవి, భర్గలేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాలలో పూజలు చేశారు. మహిళా భక్తులు కార్తిక దీపాలు వెలిగించే మొక్కలు తీసుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ సిద్దు వెంకటరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి భక్తులకు వసతి సౌకర్యాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పూజారులు పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

భైరవకోనలో భక్తుల సందడి

మానవత్వం మంటగలిసిన వేళ..

- వృద్ధ దంపతులు వీధిలోకి గెంటివేత
- ఇల్లు ఖాళీ చేయాలని హుకుం
- బీరువా పగులగొట్టి వస్తువులు మాయం
- సామాన్లు వీధిలోకి విసిరేసిన వైనం

ప్రజాశక్తి-పిసిపల్లి

మానవత్వాన్ని మంటలో కలిపి 75-80 సంవత్సరాల వయసున్న వృద్ధులను తన్నుకుంటూ బజారులోకి గెంటేశారు. ఇంట్లో ఉన్న బీరువా పగులకొట్టి విలువైన డాక్యుమెంట్లు, నగదు, బంగారాన్ని మాయం చేశారు. సామాన్లు వీధిలో వేశారు. ఈ విధంగా ఆదివారం సాయంత్రం మండలంలోని మురుగుమ్మిలో జరిగింది. ఈ సమస్యపై బాధితుడు వెంకటరావు సోమవారం స్పందనలో ఎస్‌పి మల్లికాగర్గ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కనిగిరి డిఎస్‌పికి పంపారు. బాధిత వృద్ధుడు వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. లెక్కల వెంకటరావు, రాములమ్మ వృద్ధ దంపతులు. వారికో సొంత ఇల్లు ఉంది. వెంకటరావు తన సోదరి రత్తమ్మకు వారు నివాసం ఉంటున్న ఇంటిని కానుకగా ఇచ్చాడు. వెంకటరావు దంపతులు జీవించినంత కాలం ఆ ఇంట్లో ఉండేవిధంగా, వారి తదనంతరం రతమ్మవాళ్లు ఇల్లు స్వాధీనం చేసుకొనే విధంగా ఇచ్చాడు. ఇదే ఇంటిని రత్తమ్మ తమ సోదరి కుమార్తె అయిన మల్లేశ్వరికి కానుకగా ఇచ్చింది. ఈ విషయం వెంకటరావు కుమారులకు తెలిసి తమ తండ్రి ఇల్లు తమకే దక్కాలని, కానుకను రద్దు చేయాలని కోర్టులో కేసు వేశారు. ఈ విషయం తెలుసుకున్న పుట్లూరి రత్తమ్మ కుటుంబ సభ్యులు, మల్లేశ్వరి తల్లిదండ్రులు వృద్ధులుగా ఉంటున్న వెంకటరావు, రాములమ్మపై ఆదివారం రాత్రి దాడి చేశారు. గత మూడు నెలలుగా ఇల్లు ఖాళీ చేయాలంటూ లేకపోతే హత్య చేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేశారు. చివరకు ఆదివారం సాయంత్రం వృద్ధులైన వెంకటరావు, రాములమ్మ, వారి కుమారుడు బ్రహ్మారెడ్డిపై కాంసాని జనార్దన్‌రెడ్డి, మాలకొండయ్య, పుట్లూరి మహేంద్ర, లెక్కల చంద్రమౌళి, మల్లేశ్వరిలు దాడి చేసి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులను తన్నుకుంటూ వీధిలోకి తీసుకొచ్చారు. ఇంట్లో ఉన్న సామాన్లు మొత్తం వీధిలో పడేశారు. అడ్డు వచ్చిన వారిని నానా బూతులు తిట్టారు. ఇంట్లో ఉన్న బీరువా పగులకొట్టి బంగారం, నగదు, విలువైన డాక్యూమెంట్లు కూడా తీసుకెళ్లారు. కరెంట్ మీటర్ పగులగొట్టారు. విద్యుత్ శాఖకు తెలియకుండా వైరును వారే కత్తిరించి ధ్వంసం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చేసేందుకు ఇంటిని చిందరవందర చేశారు. ఈ విధంగా తమ చెల్లెలు కోసం కానుక ఇచ్చిన ఇంటిని మానవ సంబంధాలతో నిమిత్తం లేకుండా ఆర్థిక సంబంధాలుగా మార్చి దౌర్జన్యం చేశారు. వెంకటరావుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు జరుగుతున్న వివాదాలను గుర్తించి కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ మల్లేశ్వరి కుటుంబ సభ్యులు వృద్ధులను బలవంతంగా ఖాళీ చేయించేందుకు దాడులు చేయడం ఈ ప్రాంతంలో చర్చనీయాంశమయింది. ఈ విషయంపై ఎస్‌పికి ఫిర్యాదు చేసినందున తమకు న్యాయం జరుగుతుందని వృద్ధ దంపతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఇంట్లోని సామాన్లు బయట వేసిన దృశ్యం

ఎస్‌పికి ఫిర్యాదు చేసిన వృద్ధుడు వెంకటరావు

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

పడవ తిరగబడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు

చేపల వేటకు వెళ్లి పడవ తిరగబడటంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మల్లవరం గుండ్లకమ్మ డ్యాంలో సోమవారం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. అన్నంగి గ్రామానికి చెందిన తుపాకుల శేషయ్య(42) గుండ్లకమ్మ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నిల్వ ఉన్న ఏరియాలో చేపలు పట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు పడవ తిరగబడి మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

పోలీసుల అదుపులో జూదరులు

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు మండలం దేకనకొండ గ్రామ సరిహద్దుల్లో దరిశి ప్రాంతానికి చెందిన కొంతమంది పేకాట రాయుళ్లను ఒంగోలు స్పెషల్ బ్రాంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్ద మొత్తం డబ్బులతో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు ఒంగోలు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సమాచారం అందడంతో వారు పకడ్బందీ వ్యూహంతో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురి నుంచి రూ.3,89,810 లక్షల నగదు, 12 ద్విచక్ర వాహనాలు, 13 మొబైల్ ఫోన్లు స్వాధీన పరుచుకున్నట్లు కురిచేడు హెడ్ కానిస్టేబుల్ విష్ణుష్ విలేఖర్లకు తెలిపారు. పట్టుబడిన వారికి 40- కింద నోటీసులు ఇచ్చి, ద్విచక్ర వాహనాలను, మొబైల్ ఫోన్లు ఇచ్చి పంపామని పోలీసులు తెలిపారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. గతంలో పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేసిన సమయంలో కేసులు నమోదు చేసి పేకాట రాయుళ్లను కోర్డుకు హాజరుపరిచేవారు. కానీ అందుకు భిన్నంగా అధికారపార్టీ నాయకుల ఒత్తిడితో 40- నోటీసులు ఇచ్చి పంపటంలో మర్మం ఏమిటో పోలీసు అధికారులకే తెలియాలి. పేకాట శిబిరం గత కొంతకాలం నుంచి ఆ ప్రాంతంలో జోరుగా సాగుతున్నా స్థానిక పోలీసులు దృష్టి సారించలేదు. ఇది గమనించిన ఆ ప్రాంతానికి చెందిన కొంతమంది ఈ విషయాన్ని జిల్లా పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా స్పెషల్ బ్రాంచ్ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నేరుగా వచ్చి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పజెప్పారు.



న్యాయవాదుల దీక్షకు మద్దతు తెలియజేస్తున్న షేక్ గౌస్

న్యాయవాదుల పోరాటానికి సంఘీభావం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 512ను రద్దు చేయాలని కోరుతూ కనిగిరిలో న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ రిలే నిరాహార దీక్షకు మండలంలోని చెన్నపునాయునిపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు షేక్ గౌస్ సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరారు.

కేకు కట్ చేస్తున్న మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్‌ప్రభాకర్

అన్నం సతీష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బాపట్ల

మాజీ ఎంఎల్‌సి, వ్యాపారవేత్త అన్నం సతీష్ ప్రభాకర్ పుట్టినరోజు వేడుకలు పట్టణంలోని కాపు కళ్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. తొలుత పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది విన్నకోట సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

గ్యాస్ అందిస్తున్న పూర్ణచంద్రరావు

కేంద్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆర్ఆర్ గ్యాస్ ఏజెన్సీ ఎండి పెరుగు పూర్ణచంద్రరావు తెలిపారు. స్థానిక ఆర్ఆర్ గ్యాస్ కంపెనీ వద్ద వంద మంది మహిళలకు ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను సోమవారం పంపిణీ చేశారు. స్టవ్ వెలిగించేటప్పుడు గ్యాస్ లీక్ అయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కేక్ కట్ చేస్తున్న ఆనందబాబు

వేమూరు మాజీ ఎంఎల్ఎ. మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు, రత్నకుమారి కుమారుడు డాక్టర్ నక్కా అఖిల్ బాబు జన్మదిన వేడుక సోమవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి ఎస్సీ సెల్ నాయకులు కనపర్తి సుందర్రావు, యడ్ల జయశీలరావు, కంభం సుధీర్, మైనార్టీ సెల్ నాయకులు సిరాజుద్దీన్, కుక్కలు వెంకటేశ్వరరావు, బట్టు మల్లికార్జునరావు, మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు, పులిమడోల శివకుమార్ తదితరులు అఖిలేష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపిపి లలితకుమారి దంపతులకు ఘన సన్మానం

ఎంపీపీ దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ డివి లలిత కుమారి, మల్లేశ్వరరావు దంపతులను కార్పెంటర్ సంఘ అధ్యక్షులు కోడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్పెంటర్ల వృత్తిని గౌరవించి ఎంపీపీ తగిన రీతిలో ఎప్పటికప్పుడు ఉపాధి కల్పనకు అవసరమైన అంశాల గురించి వివరిస్తూ ఉంటారని అన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే పథకాలను తెలిజేస్తూ వెన్నుదన్నుగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

14, 15 తేదీల్లో ఆశావర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - బాపట్ల

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు ధనలక్ష్మి

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల14,15తేదీల్లో కలెక్టరేట్ల వద్ద 36గంటల వంటా, వార్పు ధర్నా చేయనున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి ధనలక్ష్మి తెలిపారు. ప్రజాసంఘాల కార్యాలయంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. తీవ్రమైన పని ఒత్తిడితో అనేకచోట్ల ఆశా వర్కర్లు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా 60 యేళ్ళు దాటిన తర్వాత వట్టి చేత్తో ఇళ్లకు పంపుతున్నారని అన్నారు. ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఎటువంటి ఇన్సూరెన్స్, ఎక్స్ గ్రేషియా ఇవ్వటం లేదని అన్నారు. ఆశా వర్కర్లకు సెలవులు లేవనే నెపంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆశావర్కర్లకు భద్రత కల్పించకుండా, ప్రభుత్వ ఉద్యోగులనే నెపంతో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వర్తింప జేయడం లేదని అన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోరుతూ అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద డిసెంబర్ 14, 15తేదీల్లో వంటా వార్పు ఆందోళన చేయటానికి నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఆశావర్కర్ యూనియన్ నాయకులు వి వెంకటేశ్వరమ్మ, వాణి, శాంతకుమారి, దుర్గ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, ప్రధానకార్యదర్శి సిహెచ్ మజుందార్, జె శామ్యూల్ పాల్గొన్నారు.

బాపట్ల : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 14, 15తేదీల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఎంహెచ్ఓ విజయమ్మకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వి వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పోరంబోకు భూములకూ

నష్టపరిహారం అందించాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఆర్‌డిఒకు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, ప్రజలు

తూపానుతో నష్టపోయిన బాడే-జన్నే కాలువ పోరంబోకు భూముల సాగుదారులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆర్డీఓ షారోన్, తహశీల్దార్ ఆఫీసుల వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడారు. తుపాను వల్ల చిన్న రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారని అన్నారు. ప్రతి ఎకరాకు నష్టం పరిహారం చెల్లిస్తామన్న విషయాన్ని గుర్తు చేశారు. మండలంలో గత 80ఏళ్ల నుండి బాడే-జన్నే కాలువ పరిధిలో నల్లురిపాలెం, సిగ్గుపాలెం, బొబ్బర్లంక, విశ్వేశ్వరం గ్రామాల పరిధిలోని 350ఎకరాల భూమిని 300మందిపైగా పేదలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. గతంలో వీరికి పన్ను కట్టించుకుని ప్రభుత్వం నుండి అన్ని సబ్సిడీలు, నష్ట పరిహారాలు అందించే వాళ్ళని, గడిచిన మూడేళ్లుగా ఆన్లైన్ కాలేదనే పేరుతో ఎటువంటి నష్టపరిహారాలు ఇవ్వటం లేదని తెలిపారు. వీళ్ళు అనేక కష్టాలు ఎదుర్కొని వాస్తవమైన సాగుదారులుగా ఉండి వ్యవసాయ కార్మికులు, సన్నకారు రైతులు ఎకరానికి రూ.40వేలు పెట్టుబడి పెట్టి తుఫాన్ ప్రభావంతో సర్వం కొల్పయారని తెలిపారు. కానీ వీరికి పట్టాలు లేవనే కారణంతో నష్టపరిహారం ఇవ్వకుండా అనర్హులను చేస్తున్నారని అన్నారు. విఆర్ఓ సెల్ఫ్ డిక్లరేషన్‌తో సాగుదారులుగా గుర్తించి పరిహారం ఇవ్వాలని కోరారు. నష్టపరిహారం ఇవ్వకపోతే ఆందోళన చేస్తాని తెలిపారు. ధర్నాలో ఆయా గ్రామాల పరిధిలో కౌలురైతు నాయకులు జి దానియేలు, డి బాబురావు, కె మరిదాసు, జి జైపాలు, యెహెూను, జి లక్ష్మయ్య పాల్గొన్నారు.

కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న సిపిఎం కార్యదర్శి మణిలాల్

తుఫాను బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

జగనన్నకాలనీలో వర్షంనీళ్ల మధ్యలో నివాసం ఉంటున్న పేదలు అందరికీ రూ.2500నగదు, 25కేజీల బియ్యం, నిత్యవసరాలు పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సీపీఎం కార్యదర్శి సిహెచ్ మణిలాల్ సోమవారం వినతి పత్రం అందజేశారు. స్థానిక 18వార్డు సచివాలయం వద్ద తుపాన్ వల్ల తాము ఉపాధి కోల్పోయామని ప్రజలు తెలిపారు. ఇప్పటికీ వర్షం నీళ్లలోనే నివాసం ఉన్నామని నిరసన వ్యక్తం చేశారు. సిఎం ప్రకటించిన ఇప్పటికీ వర్షం నీటిలో నివాసం ఉంటున్న జగనన్న కాలనీ వాసులందరికీ నగదు అందించాలని లేకపోతే పేదలను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కెవి లక్ష్మణరావు, ఆగస్టన్, కె ఆస్విరథం, కె వెంకట్రావు, స్థానిక మహిళలు కె నాంచారమ్మ, ఆదిలక్ష్మి, పిచ్చయ్య, అనూష పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సమాయం చేస్తున్న నరేంద్రవర్మ

బాధితులకు టిడిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బాపట్ల

చంద్రబాబు పట్టణంలోని 3వ వార్డులో పర్యటించి తుఫాన్ భాదితులకు ప్రకటించిన రూ.5వేలు ఆర్థిక సాయాన్ని స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి ఇన్చార్జి వేగేశన నరేంద్ర వర్మ సోమవారం అందజేశారు. రాజీవ్ నగర్ కాలనిలోని 47యానాదుల కుటుంబాలకు చంద్రబాబు ఆదేశాల మేరకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. నీళ్ల మధ్యలోనే ప్రజలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 2024లో టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్ టు రిచ్ ఫథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఇక్కడ నుండే మొదలు పెట్టి ఇళ్ల నిర్మిస్తామని తెలిపారు.

వ్యవసాయమే తెలుసు..ఇంకేమి చేస్తాం..

◆ తుపానుతో కోలుకోలేని నష్టం.... ◆ ప్రభుత్వ చేయూత కోసం రైతన్నల ఎదురు చూపులు ◆ మళ్ళీ సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు

నీళ్లు నిలిచి ఉరకలెత్తి ఎండిపోయిన పొగ తోట

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రైతులకు వ్యవసాయం తప్ప మరేవి తెలియదు. తుపాను కారణంగా పంటలు అన్ని నీట మునిగి భారీగా పంటనష్టం జరిగినా, ఆర్థిక స్థోమత ఉన్నవారు, అప్పు దొరికిన రైతులు దెబ్బతిన్న మిరప, పొగాకుకు పీకేసి మళ్ళీ నారు తెచ్చుకుని పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఎప్పటికి వస్తుందో అప్పటి దాకా ఆగితే పంటల సాగు సమయం ఆలస్యం అవుతుందని రైతులు భావిస్తున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం పట్టించుకుంటుందా, ఆదుకుంటుందా లేదా అనే మీమాంసంలో ఉండకుండా తమకు తెలిసిన వ్యవసాయాన్నే నమ్ముకుని ముందుకు సాగుతున్నారు. శక్తి ఉన్నవారు తిరిగి మిరప, పొగాకు సాగుకు సిద్ధపడగా, స్థోమత లేని వారు మినుము, పెసర లాంటి సాగుకు సమాయత్తం అవుతున్నారు. కొందరు రైతులు పొలాలను అలానే వదిలేశారు.

తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో వరి పైరుకు అపారనష్టం వాటిల్లగా మెట్ట పైర్లు కూడా తుపాను దెబ్బకు తుడిచిపెట్టుకుపోయాయి. ఖరీఫ్, రబీలో నీరు లేక మోటార్లు పెట్టి, పైపులు వేసుకుని దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకుని ఆనీటిని డ్రమ్ముల్లో ఉంచుకుని మిరప, పొగాకు నారు మొక్కలు తెచ్చుకుని సాగు చేశారు. మిరప పూత దశలో, పొగాకు ఆకు కొట్టే దశలో ఉన్న సమయంలో వచ్చిన తుపానుతో పంటలన్ని దెబ్బతిన్నాయి. పంట చేతికి వచ్చే దశలో వచ్చిన తుపాను కారణంగా రైతులకు కోలు కోలేని నష్టం వాటిల్లింది. కౌలు రైతులు అయితే కోలు కోలేని రీతిలో నష్టపోయారు. కౌలు రైతులకు నష్టపరిహారం కూడా అందే పరిస్థితి లేదు. భూ యజమాని ఖాతాలోనే పంట నష్టం జమ అవుతుంది. జిల్లాలో పై ప్రాంతాల నుంచి వచ్చే వాగులు, డ్రైన్లు పొంగి మాగాణి, మెట్ట పోలాలను ముంచెత్తాయి. నష్టం జరిగినప్పటికి రైతులు మళ్ళీ అప్పులు చేసిన సాగుకు సన్నద్ధం అయ్యారు. స్థానికంగా మిరప, పొగాకు నార్లు దొరకక ఇతర ప్రాంతాల నుంచి నార్లు తెచ్చుకుంటున్నారు.

పొగాకు మొత్తం దెబ్బతింది..

బడుగు రత్నరాజు

బడుగు రత్నరాజు, కౌలురైతు, పోతుకట్ల

రమణాయపాలెం వద్ద 5ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశా. నారు వేసేందుకు కావలసిన నీటిని దూరం నుంచి తెచ్చుకుని డ్రమ్ముల్లో నింపి మొక్కలు కాపాడుకుంటూ వచ్చా. కొద్ది రోజుల్లో ఆకు కొట్టే సమయంలో తుపాను కారణం గా పొగాకు మొత్తం దెబ్బతింది. ఇప్పుడు మళ్ళీ మురికిపూడి నుంచి పొగనార్లు తెచ్చుకున్నా.. నేలలో తడి ఉంది. పొగనారు వేస్తా. ఇ క్రాప్ భూ యజమాని పేరుతో ఉన్నందున నష్టపరిహారం వారికే చేరుతుంది. దయతలచి ఇస్తే ఇస్తారు. లేదంటే అంతే.

మళ్ళీ మిరప సాగు చేస్తా..

గడ్డం శ్రీనివాసరావు

గడ్డం శ్రీనివాసరావు, చెరుకూరు రైతు

నాలుగున్న ఎకరాల్లో మిరప వేశా. మరో 4ఎకరాల్లో పొగాకు వేశా. 3ఎకరాల్లో వరిసాగు చేశా. మిరప, పొగాకు తుపానుతో బాగా దెబ్బతిన్నాయి. ఎకరంన్నరలో వరి పంట చేతికి వస్తుంది. మిరప, పొగాకు పంటలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. పీకి వేస్తున్నా. తేజ రకం మిరపనారు ఎకరాకు రూ.30 వేలు అయింది. దున్నకం, ఎరువులు, పురుగు మందులు, కూలీ ఖర్చులు అన్ని కలపి ఎకరాకు రూ.లక్ష ఖర్చు అయింది. సత్తెనపల్లిలో నారు ఉంటే కొన్నా. పొలంలో నీరు బయటకు పొయ్యాక మళ్ళీ మిరప సాగు చేస్తా.

నీటిలోనే చేను

కుర్రా భూపతిరెడ్డి



కుర్రా భూపతిరెడ్డి, రమణాయపాలెం రైతు

సొంతంగా ఉన్న ఎకరం భూమిలో మిరప సాగు చేశా. నారుకు రూ.20వేలు అయింది. దున్నకం, నాటుకూలీ ఖర్చులు రూ.9వేలు అయ్యాయి. పురుగు మందులు, ఎరువులు రూ.15 వేలు అయ్యాయి. 2నెలల పంట. పూత, పిందె దశలో ఉంది. తుపానుతో మిరప చేను నీటిలో ఉండిపోయింది. ఉరకెత్తి పోయింది. మళ్ళీ మిరప సాగు చేసే స్థోమత లేదు. పెట్టుబడి అవసరం లేని ఆరుతడి పంట ఏదైనా సాగు చేస్తా.

ఉచితంగా టైలరింగ్ కోర్సు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో 3 నెలల పాటు ఉచితంగా టైలరింగ్ కోర్సు శిక్షణ ఇస్తున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ అంజమ్మ తెలిపారు. ఈ శిక్షణకు 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసుగల వారు అర్హులని తెలిపారు. కావున నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9963005209 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ఈ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని వెంగళాయపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో రబీ-2023 ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జి వెంకటస్వామి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ-2023లో పిసిపల్లి మండలంలో మినుము 2,300 ఎకరాలు, వరి 450 ఎకరాలు, మిరప 220 ఎకరాలు, శనగ 250 ఎకరాలు, కంది 109 ఎకరాలు, బొబ్బర 80 ఎకరాలు, పొగాకు 245 ఎకరాలు, ఉలవ 125 ఎకరాలలో రైతులు సాగు చేశారన్నారు. రైతులు గ్రామ వ్యవసాయ సిబ్బందిని, విఆర్ఒను సంప్రదించి రబీ-2023 సాగు చేసిన ఇ-పంట నమోదు చేయించుకోవాలన్నారు.

తెలుగుదేశం పార్టీ నిజ నిర్ధారణ బృందం పర్యటన..

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఆంధ్రప్రదేశ్ జాతీయ అధ్యక్షులు, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మార్కాపురం నియోజకవర్గంలో ఇటీవల మిచౌంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను తెలుగుదేశం పార్టీ నిజనిర్ధారణ బృందం కొనకనమిట్ల మండలంలోని పెదారికట్ల, సిద్దవరం గ్రామాల్లోని దెబ్బతిన్న శనగ, మిరప, పొగాకు, వరి పంటలను పరిశీలించింది. ఈ బృందంలో హిందూపురం మాజీ పార్లమెంటు సభ్యులు నిమ్మల కిష్టప్ప అధ్యక్షతన మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పరిశీలకులు దొడ్డపునేని రాజనాయుడు, తెలుగుదేశం నాయకులు గునుపూడి భాస్కర్, తెలుగు రైతు నియోజకవర్గ నాయకులు కాకర్ల శ్రీనివాసులు, యర్రగొండపాలెం నియోజకవర్గం తెలుగు రైతు నాయకులు చిట్యాల వెంగళ్‌రెడ్డి తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు నిమ్మల కిష్టప్ప, మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిలు మాట్లాడుతూ మొన్నటి వరకు కరువుతో అల్లాడిన ఈ ప్రాంతం మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు శనగ, మిరప, పొగాకు, వరి పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కనీసం పంట నష్టం గురించి అంచనాలు కూడా రూపొందించలేదని అన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటించి అంచనాలు రూపొందించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గతంలో హుద్ హుద్

పంటలను పరిశీలిస్తున్న టిడిపి బృందం

తుపాను సంభవించినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాత్రింబవళ్లు పనిచేసి రైతులను, ప్రజలను ఆదుకున్నారని, కానీ ఇప్పటి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయమని అన్నారు. తక్షణమే ప్రభుత్వం దెబ్బతిన్న మిరప, వరి పంటలకు హెక్టారుకు రూ.30 వేలు, అపరాలకు రూ.15 వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పొగాకు పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ కన్వీనర్ మూరబోయిన బాబురావు, పొదిలి మాజీ ఏఎంసీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య, గొట్లగట్టు సర్పంచ్ పెరికే బూన్, మాజీ కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల బిసి సెల్ నాయకులు అంకాల రోశయ్య, మువ్వ కాటమరాజు, కిలారి బొంతయ్య, బ్రహ్మయ్య, రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు

సెమీక్రిస్మస్ వేడుకల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి: స్థానిక పొదిలి రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. దర్శి రీజనల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ వారు నిర్వహించే గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ జరుపుకునే క్రిస్మస్ వేడుకల్లో ఆ దేవుని ఆశీస్సులు అందరూ పొందాలన్నారు. తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్లు దేవుని ఆశీస్సులు అందజేశారు. మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, పాస్టర్లు పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, డాక్టర్ ఉగ్ర

పేదల కష్టం తెలిసిన నాయకుడు 'ఉగ్ర'

ప్రజాశక్తి-కనిగిరి: డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేదల కష్టం తెలిసిన నాయకుడని మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి అన్నారు. కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్లో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం పేదలకు ఆయన భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లను వైసీపీ ప్రభుత్వం మూసివేసిందని విమర్శించారు. పేదల కష్టం తెలిసిన నాయకుడు కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేదల ఆకలి తీర్చేలా నిరాటంకంగా అన్నా క్యాంటీన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజల మనసులో స్థానం సంపాదించిన డాక్టర్ ఉగ్ర వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఆయన వెంట డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని పేదలకు భోజనం వడ్డించారు.

ఆ చట్టాలను రద్దు చేయాలి: ఏరాసు

ప్రజాశక్తి-కనిగిరి

పేదలకు న్యాయం జరగని, నష్టం కలిగించే చట్టాలను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. కనిగిరి పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఎదుట ఏపీ భూహక్కు యాజమాన్య చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ కనిగిరి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలను నిర్వహించగా మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, కనిగిరి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి పాల్గొని సంఘీభావాన్ని తెలియజేశారు. ప్రజా వ్యతిరేక చీకటి చట్టాలను తక్షణమే రద్దు చేయాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు అడకస్వాములు, బ్రహ్మారెడ్డి, నారపరెడ్డి వెంకటరెడ్డి, బాలు ఓబుల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఇంద్రభూపాల్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం అందజేత

ప్రజాశక్తి-దర్శి: తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన గూడా వెంకటరెడ్డి కుమారులు ప్రసాద్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు గుంటి గంగమ్మ భవాని సన్నిధిలో ఉన్న మల్లిఖార్జున స్వామి ధూపనైవేద్యం కోసం రూ.లక్ష విరాళాన్ని ధర్మకర్త మన్నెబోయిన హనుమంతరావుకు అందజేశారు. సోమవారం గుంటిగంగమ్మ వారి సన్నిధిలో ఈ నగదును అందజేశారు.

జీరో ప్రమాదాలు అభినందనీయం: మైన్స్ సేఫ్టీ డైరెక్టర్

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి ప్రాంత గెలాక్సీ గనులలో గత ఏడాదిగా జీరో ప్రమాదాలు నమోదు కావడం అభినందనీయమని మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ సుప్రియా చక్రవర్తి పేర్కొన్నారు. సోమవారం చీమకుర్తి ప్రాంత గనులలో సేఫ్టీ వీక్ తనిఖీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రానైట్ గనులలో ఆయన విస్తృతంగా పర్యటిం చారు. యాపిల్ గ్రానైట్ గనిలో జరిగిన తనిఖీలో ఆయన కార్మికులచే సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. ఆయనకు యాపిల్ గని యజమాని, సేఫ్టీ వీక్ హోస్ట్ శిద్దా సూర్యప్రకాశరావు, కమిటీ కోశాధికారి శిద్దా పవన్‌కుమార్ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం రామతీర్థంలోని విటిసిలో గ్రానైట్ కంపెనీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉత్పత్తి, భద్రత రెండూ అవసరమని, యజమానులు గని పనిలో అవసరాలు గుర్తించాలని అన్నారు. జీరో ప్రమాదాలు లక్ష్యంగా యజమానులు పని చేయాలని సూచించారు. భద్రత నిరంతరం సాగేలా

ప్రతిజ్ఞ చేయిస్తున్న మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ సుప్రియ చక్రవర్తి

చర్యలు కొనసాగించాలన్నారు. అనంతరం డైరెక్టర్ సుప్రియా చక్రవర్తిని సేఫ్టీ వీక్ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యాపిల్ గ్రానైట్ అధినేత శిద్దా సూర్యప్రకాశరావు, ప్రతినిధి శిద్దా పవన్‌కుమార్, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీ నారాయణ, పల్లవ గ్రానైట్ అధినేత కె సుబ్బారెడ్డి, షాహీన్ గ్రానైట్ అధినేత అజీమ్, ఆర్ఆర్ఆర్ గ్రానైట్ అధినేత ఆర్‌పి రవి, జివిటిసి ప్రధాన కార్యదర్శి సుభాస్కరరెడ్డి, గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరిబాబు, పొకర్ణ గ్రానైట్ జిఎం సుబ్బారావు, హంసా గ్రానైట్ చంద్రారెడ్డి, సదరన్ గ్రానైట్ జయరామిరెడ్డి, జయ మినరల్స్ ప్రసాదు, ఫణికుమార్ పాల్గొన్నారు.

చంద్రన్న పాలన కోరుకుంటున్న ప్రజలు: ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు బాదుల్లా వారి వీధి, రైస్ మిల్ వీధి ప్రాంతాల్లో సోమవారం టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మన ఊరు -మన ఉగ్ర.. బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సైకో జగనాసుర పాలన పోవాలని, చంద్రన్న ఆధ్వర్యంలో సైకిల్ పాలన రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని అన్నారు. సంక్షేమం పేరుతో సంక్షోభ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ ఫిరోజ్, మ్మినేని వెంకట్‌రెడ్డి, షేక్ అహ్మద్, చిలకపాటి లక్ష్మయ్య, నజీముద్దీన్, రీటా ఫయాజ్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఉగ్ర

స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పిసిపల్లి: ఈ నెల 15వ తేదీ నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్ర పోటీలకు సంబం ధించిన స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. యువత క్రీడల వైపు ఆసక్తి చూపాలన్నారు. ఆటల వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి నవంబర్ 27వ తేదీ నుంచి క్రీడాకారులు రిజిష్టరు చేయించుకున్నారు. ఈ నెల 15 నుంచి క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ మండల స్థాయిలో ఆడనున్నట్లు తెలిపారు. కిట్‌లను ఎంపిపి అత్యాల జఘన్య సచివాలయ సిబ్బందికి అందజేశారు. సోమవారం స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ జి కోటయ్య, వైసిపి నాయకులు వై మోహన్‌రెడ్డి, ఓకె రెడ్డి, మైలా కొండయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

'ఆడుదాం ఆంధ్ర'పై ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని సచివాలయాల పరిధిలో ఈ నెల 15 నుంచి జరగనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాతపూడి సుకుమార్ అధ్యక్షతన మండల విద్యాశాఖ అధికారి, జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి కావలసిన సదుపాయాల గురించి ఆన్‌లైన్ స్కోర్ ఎలా నమోదు చేయాలో అనేదానిపై సచివాలయ పరిధిలో ఉన్న వాలంటీర్స్‌కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఎలా నిర్వహించాలి అనేదానిపై సచివాలయం వారీగా కమిటీలు వేశామని, ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, విద్యాశాఖ అధికారి రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల జీవన ప్రమాణ పెంపునకు యునిసెఫ్ కృషి

ప్రజాశక్తి-కనిగిరి

యునిసెఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో చింతలపాలెం ఎస్‌సి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌బిసిసి సెల్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీ క్రిస్టియాన అధ్యక్షతన ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ యునిసెఫ్‌ను 1946 డిసెంబరు 11న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఏర్పాటు చేశారని జాతి, మత, రాజకీయ వివక్షలేవీ లేకుండా అవసరాలే ఆధారంగా పిల్లలకు సహాయ పడాలన్నది యునిసెఫ్ లక్ష్యమని అన్నారు. పిల్లల జీవన ప్రమాణ పెంపునకు యునిసెఫ్ కృషి చేస్తుందని

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

తెలిపారు. ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ యునిసెఫ్ దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం "ప్రతి బిడ్డ కోసం, ప్రతి హక్కు" అనే అంశంపై కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి జ్యోతి దేవి, పి జ్యోతి, పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, కమ్యూనిటీ సోషల్ వర్కర్ జి సలోమి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్, మాలకొండయ్య పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి

ఘనంగా భారతీయ భాషోత్సవం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

సుబ్రహ్మణ్య భారతి జన్మదినాన్నిమండలంలోని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సోమవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు, బహు భాషావేత్త సుబ్రహ్మణ్యం భారతీ జన్మదినోత్సవాన్ని భారత ప్రభుత్వం భారతీయ భాషో త్సవంగా జరపాలని ఆదేశించిందని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు అందరూ దేశంలోని వివిధ భాషల గురించి తెలుసుకోవటమేనని అన్నారు. ఇతర బాషల పట్ల గౌరవం పెంచుకోవాలని అన్నారు. భాషలు ఏవైనా భావం ఒక్కటే అనే భావనని విద్యార్థులు చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని కోరారు. తెలుగు ఉపాధ్యాయుడు బండారు అనిల్ కుమార్ సుబ్రహ్మణ్య భారతి జీవిత చరిత్ర, భారత ప్రభుత్వం గుర్తించిన 22భాషలు గురించి ప్లే కార్డ్లుల ద్వారా వివరించారు. కార్యక్రమంలో పర్వతనేని పావని, భవనం శివలీల, అంబటి సురేష్, సిహెచ్ శ్రీవిద్యలక్ష్మి, పెండ్యాల రాధిక, గోబిదేశి ఆదినారాయణ, వరికల్లు బ్రహ్మయ్య, గోరంట్ల సంధ్యారాణి, అంబటి అపర్ణ, భాలపాటి నరసయ్య పాల్గొన్నారు.

చవిటిపాలెంలో అంతుబట్టని వ్యాధి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని చవిటిపాలెం గ్రామంలో అంతుబట్టని వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వీరవల్లి కోటేశ్వరరావు, రామ తులశమ్మ, కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 8వందల కుటుంబాల వరకు ఉన్నాయి. రెండు నెలలుగా ప్రతి ఒక్కరికి జ్వరం తోపాటు కాళ్ల వాపులు, శరీరం దురదలు, కీళ్ల నొప్పులు వంటి తీవ్ర అనారోగ్య పరిస్థితులు నెలకొని ఉన్నాయని అన్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవాళ్లు నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రులక్లో చికిత్స పొందుతున్నారు. కొందరు పేద కుటుంబాల వారు గ్రామంలోని ఆర్ఎంపిల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. వైద్యానికి ఒక్కొక్కరికి రూ.15వేలు ఖర్చుతో కొంత ఉపశ్మాంతి కలుగుతుందని అన్నారు. ఎంత చేసినా వ్యాధి తీవ్రత తగ్గటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపం వల్లే వ్యాధులు సోకుతున్నాయని చెబుతున్నారు. గ్రామ పంచాయతీ ఆఫీసులో విలేజ్ క్లినిక్లు ఉండి కూడా ఆరోగ్య సిబ్బంది రక్త పరీక్షలు చేయడం లేదని అంటున్నారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియదన్నారు. సర్పంచి ఉండి కూడ కనీసం వీధుల వెంట బ్లీచింగ్ పౌడరు కూడా చల్లడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆదివారం గ్రామంలో తుఫాన్ దాటికి దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ దృష్టికి వ్యాధి విషయాలను ప్రజలు తీసుకొచ్చారు. వెంటనే రవికుమార్ ఫోన్ ద్వారా జిల్లా డిఎంహెచ్ఓతో మాట్లాడారు. గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే తానే వైద్య శిబిరం పెట్టిస్తానని చెప్పారు. అయినా కూడా ఇంతవరకు గ్రామంలో ఎలాంటి వైద్య శిబిరాలు పెట్టి పరీక్షలు చేయలేదు. మందులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి, గ్రామస్తులకు సోకిన వ్యాధుల నుండి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భుహక్కుల చట్టం లోపభూయిష్టంగా ఉందని, దానిని వెంటనే రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈనెల 15వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొల్లా నరేంద్ర, పోతిని సురేంద్ర, రావి శ్రీనివాసరావు, చాగంటి సుబ్బారావు, దగ్గుబాటి రాఘవయ్య, తులసి రాజేష్, కరి ప్రవీణ్, పూరిమెట్ల జాను, రమణి, ధనలక్ష్మి, రేష్మ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ ఆధారంగా నష్టపరిహారం

ప్రజాశక్తి - పంగులూరు

తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు ఈ క్రాఫ్ట్ చేయించి వారి పొలాన్ని పరిశీలించి, నష్టపరిహారం రాయాలని తహశీల్దారు పద్మావతి, ఎఒ సుబ్బారెడ్డి అన్నారు. సచివాలయ, రెవెన్యూ అధికారుల, గ్రామ వ్యవసాయ సహాయకుల సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. తుఫాను కారణంగా 33శాతం కంటే ఎక్కువ నష్టపోయిన రైతులకు, ఆయా ఆర్బికె సిబ్బంది ద్వారా ఈ క్రాఫ్ట్ చేయించి, ఆ తరువాత ఆ రైతుల పొలానికి నష్టపరిహారం రాయాలని కోరారు. కౌలు రైతులకు కూడా ఈ క్రాప్ చేయించాలని ఆదేశించారు. ఈనెల 17తో నమోదు ముగుస్తుందని తెలిపారు.

భట్టిప్రోలు (వేమూరు) : తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంటలను నమోదు చేసేందుకు సోమవారం నుండి ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎఒ సిహెచ్ సునీత తెలిపారు. రైతులు పొలానికి సంబంధించిన ఆధారాలుతో సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలని సూచించారు.

నగరం : ఇటీవల సంబవించిన తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటల నష్ట పరిహార జాబితా తయారుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు, విఆర్ఒతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య మాట్లాడుతూ ఇక్రాఫ్ నమోదు కాబడిన ప్రతి ఒక్క ఎకరానికి, నష్టపోయిన రైతుల పేర్లను నమోదు చేయాలని కోరారు. సమావేశంలో తహశీల్దారు ఎం ప్రమీల, ఎఒ వి రమేష్ బాబు, ఎంపీడీఒ చక్రపాణి ప్రసాద్, మండల అడ్వైజరి కమిటీ చైర్మన్ తాడివాక అనిల్ కుమార్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : పంట నష్టం అంచనా వివరాలను సక్రమంగా రూపొందించి నివేదిక అందజేయాలని తహసిల్దార్ బి వెంకటేశ్వర్లు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తుపాను వలన పంట నష్టపోయిన రైతులు వివరాలు వీఆర్వోలు, విఎఏలు 17లోగా నివేదికలు తయారు చేయాలని కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

అమర్తలూరు (చెరుకుపల్లి) : పంట నష్టం వివరాలు నమోదు ప్రారంభించామని, రైతులందరూ తమ పొలాల వద్ద ఉండి వివరాలు నమోదు చేయించుకోవాలని ఎఒ ఉయ్యూరు లోకేశ్వరి కోరారు. తహసిల్దార్ పీ మెహర్ కుమార్ మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా నష్టపోయిన పంట వివరాలను నమోదు చేయాలని, రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల వరకు నమోదు చేయించవచ్చని తెలిపారు.

నేటికీ తగ్గని నీరు..మొలకెత్తుతున్న ధాన్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నీళ్లలో మొలకెత్తుతున్న వరి పనల కుప్పలు

తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో చేరిన నీరు నేటికీ తగ్గకపోగా పనలపై ఉన్న ఓదెలు మొలకలు వస్తున్నాయి. కురిసిన భారీ వర్షాలతో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటివరకు దాదాపు 20 శాతం కూడా కోతలు పూర్తి కాలేదు. మిగిలిన 80శాతంలో 60శాతం కోతలు కోయటానికి సిద్ధంగా ఉండగా 20శాతం ఓదెలు, కుప్పల దశలో ఉన్నాయి. మురుగు నీటిపారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మూడు రోజుల నుండి ఎండలు కాస్తున్నప్పటికీ పొలాల్లో ఉన్న వర్షపు నీరు బయటికి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో రైతులు పంట పొలానికి వెళ్లి చూసుకుని వెను తిరగటం తప్ప వేరే మార్గం కనిపించడం లేదు. కళ్ళముందే పడిపోయిన పంట నీటిలో కుళ్ళిపోతుండగా ఓదె దశలో ఉన్న పైరు మొలకలు వచ్చి దుర్వాసన వెదజల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలు పరిసర ప్రాంతాల్లో ముందుగా వరికోతలు కోసి కుప్పలు వేసిన రైతులకు పంట పొలాల్లో కొప్పల చుట్టూ నేటికీ మోకాలిలోతు నీరు ఉండటంతో కుప్పలు కొంతమేర దెబ్బతినే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అలాగే లోతట్టు ప్రాంతాలైన పల్లెకోన, రాచూరు, అద్దేపల్లి, ఐలవరం తదితర ప్రాంతాల్లో పైరు నేల వాలి నేటికి కంకులు నీటిలోనే ఉండటంతో కుళ్లిపోయి మొలకొచ్చి దెబ్బ తినే ప్రమాదం 80శాతం పైగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటికాడ కొచ్చిన పంట కళ్ళముందే నీటిపాలవుతుంటే చూచి తట్టుకోలేక అన్నదాత ఆందోళనకు గురవుతున్నారు.

ప్రారంభం కానీ దెబ్బతిన్న పంట నమోదు

వర్షాలు కురిసి మూడు రోజులు దాటుతున్నప్పటికీ నేటికీ దెబ్బతిన్న పంటలను నమోదు చేసేందుకు అధికారులు రాకపోవడంతో రైతులు ఆందోళన గురవుతున్నారు. ప్రభుత్వం పంట నమోదు సత్వరం చేపట్టాలని ఆదేశించినప్పటికీ అధికారులు మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో తమకు నమోదు పై ఉత్తర్వులు అందలేదని చెబుతున్నారు.

వైసిపి ఇన్‌ఛార్జి మార్పుపై కలకలం

ప్రజాశక్తి - పంగులూరు

హనిమిరెడ్డికి కేకు తినిపిస్తున్న అభిమానులు

అద్దంకి వైసిపి ఇన్చార్జి బాచిన కృష్ణ చైతన్యను ఆ పార్టీ అధిష్టానం బాధ్యతల నుండి తప్పించిందనీ కృష్ణ చైతన్య స్వగ్రామమైన పంగులూరులో సోమ వారం సాయంత్రం కలకలం రేగింది. ఆ పార్టీ కార్యకర్తలు, కృష్ణ చైతన్య అనుచరులు ఆలోచనలో పడ్డారు. ఇన్చార్జి పదవి నుంచి కృష్ణచైతన్యను తొలగించి ఆ స్థానంలో గుంటూరు జిల్లాకు చెందిన వ్యాపారవేత్త హనిమిరెడ్డికి అప్పగిస్తున్నారన్న వార్త సోమవారం గుప్పుమన్ని. కృష్ణ చైతన్య తండ్రి బాచిన చెంచు గరటయ్య 1978 నుండి రాజకీయాల్లో ఉన్నారు. గతంలో అద్దంకి నియోజకవర్గానికి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2009లో కాంగ్రెస్‌లో చేరిన గరటయ్య వైఎస్ఆర్ మరణానంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని వైసిపిలో చేరారు. వైసిపి తరపున 2019 అసెంబ్లీ ఎన్నికల్లో అద్దంకి నుండి పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికలు జరిగిన ఆరు నెలలకు గరటయ్య కుమారుడైన కృష్ణ చైతన్యకు నియోజవర్గ ఇన్చార్జి బాధ్యతలను జగన్మోహన్‌రెడ్డి అప్పగించారు. తరువాత రెండేళ్లకు ఆయనకు ఇన్చార్జి పదవితో పాటు శాప్ నెట్ చైర్మన్ పదవి కూడా ఇచ్చారు. గత 4సంవత్సరాలుగా కృష్ణ చైతన్య ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముందున్నారు. గ్రామాల్లో నిత్యం తిరుగుతూ ప్రజల్లో ఉన్నారు. అయితే నియోజక వర్గంలో కొంత మంది అతనికి వ్యతిరేకంగా జట్టు కట్టి అధిష్టానానికి పలుమార్లు వ్యతిరేకతను తెలిపారు. ఈ క్రమంలోనే కృష్ణ చైతన్యకు సీటు రాదనే ప్రచారం బాగా ఊపొందుకుంది. ఇటీవల జరిగిన కార్యక్రమాల్లో కృష్ణ చైతన్య కొంత వెనుక పట్టు పట్టారని ప్రచారం ఉంది. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ఇన్‌ఛార్జి బాధ్యతలనుండి కృష్ణ చైతన్యను తప్పించి హనిమిరెడ్డికి అప్పగిస్తున్నట్లు వార్తలు రావడం కార్యకర్తల్లో తీవ్ర చర్చకు దారితీసింది. నాలుగేళ్ల కాలంలో కృష్ణ చైతన్య కరోనా సమయంలో ఒక్కరోజు కూడా ఇంటి దగ్గర ఉండకుండా ప్రజలతోనే తిరిగాడని, ప్రజల్లోనే ఉన్నాడని, అలాంటి వ్యక్తిని తప్పించి మరొకరికి బాధ్యతలు ఇవ్వడం సరైనది కాదని అంటున్నారు. ఏది ఏమైనా అధిష్టానం నిర్ణయం ప్రకారం, పార్టీ ఎవరిని నియమిస్తే వారితోనే ఉంటామని కొంతమంది ప్రజాశక్తికి తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర కిట్లుపంపిణీ చేస్తున్న ఎంపిడిఒ స్వరూపరాణి

పారదర్శకంగా సేవలు అందించాలి

ప్రజాశక్తి - చిన్నగంజాం

ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని ఎంపీడీఒ కె స్వరూప రాణి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు కార్యదర్శుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టానికి లోబడి పరిపాలన చేయాలని చెప్పారు. ఇష్టాను సారంగా వ్యవహరిస్తే తద్వారా వచ్చే పరిణామాలకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈఓఆర్డి ఎన్ వేణుగోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ పంచాయతీలకు ఆదాయం సమకూర్చే మార్గాలను, అనుసరించవలసిన విధానాలను వివరించారు. కార్యక్రమానికి గ్రేడ్ వన్ నుండి సిక్స్ క్యాడర్ వరకు కార్యదర్శులు హాజరయ్యారు. ఆడుదాం ఆంధ్ర కిట్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు ఆళ్ల మస్తాన్‌రావు, ఎన్ సూర్యనారాయణ, గోలి ఉషా, శైలజ, మేడికొండ భారతి, కృపారావు పాల్గొన్నారు.

పడిపోయిన అరిటి తోటలోని చెట్లు

వాణిజ్య పంటలకు పరిహారం ఏదీ?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో పాటు వీచిన ఈదురుగాలకు లంక గ్రామాల్లో వాణిజ్య పంటల్లో ముఖ్యమైన అరటి తోటలు విరిగిపోయి. రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. ఓ ప్రక్క మాగాణి భూముల్లో సాగు చేసినా వరి పంట పూర్తిగా దెబ్బతిని నేటికీ పొలాల్లో నీరు బయటికి వెళ్లే పరిస్థితి లేకుండా రైతులు నానా అవస్థలు పడుతున్నారు. లంక గ్రామాల్లో రైతులు సాగు చేసిన వాణిజ్య పంటలు నీట మునిగి కుళ్ళిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా వరదలు విపత్తులకు జరుగుతున్న నష్టాలను నమోదు చేసి నష్టపరిహారం అందించిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు అరటి తోటలు పదుల సంఖ్యలో ఎకరాల్లో విరిగిపోయి రైతులకు తీరని నష్టాన్ని కలిగించాయని, సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా నమోదు చేసి పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరుచున్నారు.

విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ మాజీ అధ్యక్షులు, పర్యావరణ ప్రేమికులు మనం త్రిమూర్తులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని తిమ్మాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, హిందూ స్కూల్స్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నీడ, పండ్లు, పూల మొక్కలు నాటారు. తిమ్మాయిపాలెం జెడ్‌పి స్కూలు హెచ్ఎం పెంట్యాల గంగాధర్ అధ్యక్షతన జరిగిన సభలో రోటరీ అధ్యక్షులు మల్లాది శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే జన విజ్ఞాన వేదిక చెకుముకి ఐదు మాస పత్రికలు ప్రతినెలా వచ్చే విధంగా సంవత్సరం పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జ్యోతి చంద్ర మౌళి, డాక్టర్ యు దేవపాలన, నర్రా శ్రీలక్ష్మి, సంధిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, తమన శ్రీనివాసరావు, హెచ్ఎం పురుషోత్తమ, పిఈటి సుబ్బారావు, జెవివి జిల్లా సభ్యులు పొడపాటి కృష్ణారావు, పరిటాల పవన్, సర్పంచి అంగలకుర్తి హనుమయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి

7

మంగళవారం 12 డిసెంబర్ 2023

అమలు కాని నేతల హామీలు

• అవస్థల పాలవుతున్న రైతులు • పంటల ఎన్యుమరేషన్‌కు కానరాని అధికారులు • పత్తాలేని పరిహార లెక్కలు

ఉరకలెత్తి, ఆకులు వాలిపోయిన పొగతోట

ప్రజాశక్తి - పంగులూరు

తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగానికి అండగా ఉంటాం. అధైర్య పడవద్దు. ఆదుకుంటామన్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. తుఫాన్ వచ్చి పోయి ఆరు రోజులు గడుస్తుంది. ఎన్యుమరేషన్ చేసే అధికారులు ఇంతవరకు గ్రామాల్లో రైతుల వద్దకు రాలేదు. అసలు ఎన్యుమరేషన్ చేస్తారో, లేదో తెలియక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళ్ళముందే పైర్లు ఎండిపోతున్నాయి. రూ.లక్షలాది పెట్టుబడులు సర్వనాశనం అయ్యాయి. ఏమి చేయలేని పరిస్థితుల్లో రైతులు చేతులు కట్టుకొని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిచౌంగ్ తుఫాను కారణంగా మండలంలోని పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో పొగాకు 1150హెక్టార్లు, మిర్చి 830హెక్టార్లు, శనగ 2650 హెక్టార్లు, మొక్కజొన్న 546హెక్టార్లు, మినుము 497హెక్టార్లు, వరి 90హెక్టార్లలో సాగు చేశారు. తుఫానుకు ముందు వరకు బాగానే ఉన్న పంటలు, తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. పొగాకు నేల వాలింది. ఆకులు మొత్తం పండిపోతున్నాయి. నేలలో ఉన్న శనగ మొక్క లు, అప్పుడే నేలపైకి వచ్చిన మొక్క కుళ్ళిపోతున్నాయి. మిర్చి పూతరాలిపోయింది. మొక్కపై ఉన్న కాయలు రాలిపోయాయి. చెట్లు విరిగి నేల వాలాయి. మొక్కజొన్న పైరు పూర్తిగా నేలవాలి పోయింది. మినుము కాయ రాలిపోవటం, కాయల్లోకి నీళ్లు వెళ్లి విత్తనం చెడిపోయింది. భారీ స్థాయిలో పంటలు నష్టం జరిగింది. తుఫాను తర్వాత పొలాలకు వెళ్లి పైర్లు చూసుకున్న రైతులకు కంటనీరే మిగులుతుంది. ఈ ఏడాది వాతావరణం బాగుంటుందని, పంటలు బాగా పండుతాయని ఆశించిన కౌలు రైతులు కౌలు రేట్లు భారీగా ఉన్నా, అప్పులు చేసి కౌలు పొలాలు సాగు చేశారు. ఎకరా రూ.15వేల నుండి రూ.30వేల వరకు కౌలు ధరలు ఉన్నాయి. వ్యవసాయంలో 60శాతం కౌలు రైతులే ఉన్నారు. కౌలు రైతులకు పంటలు పెట్టుబడితో పాటు కౌలు కూడా నష్టపోతున్నారు. తుఫాను తర్వాత పంటలను పరిశీలించడానికి జిల్లాకు వచ్చిన సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతులను ఆదుకుంటానని, రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదని, నష్టపోయిన ప్రతి రైతుకి నష్టపరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఆరు రోజులు దాటినా ఇంతవరకు ఆ హామీని నిలబెట్టుకునే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. నష్టాలు అంచనా వేయటానికి ఒక్క అధికారి కూడా తమ పొలాలకు రాలేదని చెబుతున్నారు. మరి కొద్ది రోజులు గడిస్తే నష్టాలు అంచనా వేయడం కూడా కష్టమేనని రైతులు చెబుతున్నారు. వెంటనే అధికారులు తమ పంటలను పరిశీలించి నష్టం అంచనాలు వేయాలని కోరుతున్నారు. వెంటనే నష్టపరిహారాలు అందజేయాలని వాపోతున్నారు.

పరిశీలన టీములు వేస్తాం

మండలంలో తుఫాను కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించి ఎన్యుమరేషన్ రాసేందుకు టీములు ఏర్పాటు చేస్తామని ఎఓ సుబ్బారెడ్డి తెలిపారు. మిర్చి, పొగాకు, మొక్కజొన్న, మినుము, శనగ పంటలు నష్టపోయారని తెలిపారు. వీటిని ఉన్నతాధికారులు ఇచ్చిన సూచనలు మేరకు పరిశీలించి, నష్టాలు అంచనాలు తయారు చేస్తామని తెలిపారు.

ఎఓ సుబ్బారెడ్డి

అప్పులు తెచ్చి సాగు చేసాం

ఈ ఏడాది వాతావరణం బాగుంటుందని ఆశపడి 5 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తే తుపానుకు దెబ్బతిన్నాయని చందలూరు గ్రామానికి చెందిన కౌలు రైతు తమ్ములూరి పెదకోటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు ఎకరాల్లో మూడు ఎకరాలు పొగాకు, ఒక ఎకరం శెనగ, ఒక ఎకరం మిర్చి సాగు చేశానని చెప్పారు. ఎకరం కౌలు రూ.20వేలకు తీసుకొని సాగు చేశానని చెప్పారు. మిరప తోటకు రూ.లక్ష, ఐదు ఎకరాల కౌలు రూ.లక్ష, శనగ పొగాకు రూ.80వేలు మొత్తం రూ.2లక్షల 80వేల నష్టపోయినట్లు చెప్పారు. అధికారులు ఎప్పుడు వస్తారని ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

తమ్ములూరి కోటయ్య, కౌలు రైతు, చందలూరు.

తుపానుకు పోగా మిగిలిన దాంట్లో కలుపులు పెరిగింది

తుపాను కారణంగా పంటలు దెబ్బతిన్నగా భారీ వర్షాలకు పొలాల్లో కలుపులు పెరిగిపోయాయని నూజిలపల్లి గ్రామానికి చెందిన రైతు కొండ్రగుంట రవి తెలిపారు. తాను మూడు ఎకరాలు మిర్చి, ఏడు ఎకరాలు శనగ సాగు చేశానని, తుపానుకు రెండు దెబ్బతిని పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిలిందని అన్నారు. వర్షాల కారణంగా కలుపు పెరిగిపోయిందని తెలిపారు. కలుపు తీయటానికి ఎకరాకు రూ.20వేల వరకు అయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. అధికారులు పంట నష్టం నమోదు చేయాలని కోరారు.

కొండ్రగుంట రవి, రైతు, నూజిల్లపల్లి.

స్వర్ణం సాధించిన రేపల్లె వాసి కుమార్

బాడీ బిల్డర్ పోటీల్లో స్వర్ణ పతకం

ప్రజాశక్తి -రేపల్లె

ఓపెన్ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డర్ పోటీల్లో పట్టణానికి చెందిన ఇవిఎన్ కుమార్ స్వర్ణం పతకం సాధించారు. విజయనగరం జిల్లా రాజాంలో జిఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో డిబిబిఏ అసోసియేషన్ ఓపెన్ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ 2023పోటీలు నిర్వహించారు. పోటీల్లో 90మంది పాల్గొనగా రేపల్లె పట్టణంకు చెందిన ఇవిఎన్ కుమార్ ప్రతిభ కనపర్చి స్వర్ణం పతకం సాధించాడు. స్థానిక తాలూకా ఎదురు స్టేట్ బ్యాంకుపైన నెలకొల్పిన బీఆర్ఎస్ పర్ జిమ్‌లో ట్రైనర్ భూపతి రాజేష్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతూ పోటీల్లో పాల్గొన్న కుమార్ 60కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో స్వర్ణ పతక విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా కుమార్‌ను జిమ్ నిర్వహకుడు శిక్షకుడు భూపతి రాజేష్ అభినందించారు.

పద్య నాటకాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - బాపట్ల

కావ్య రమ్యం నాటకం అద్భుతమైన కావ్యాన్ని అందమైన రంగస్థలంపై నాటక రూపంలో ప్రదర్శించినప్పుడే ఆ నాటక రచనకు పరిపూర్ణత లభిస్తుందని రంగస్థల, సినిమా నటులు, దర్శకులు కెఎస్‌టి సాయి అన్నారు. పట్టణంలోని రోటరీ కళ్యాణ మండపంలో పద్య కవి అచ్యుతుని శంభు ప్రసాద్ రచించిన సాధ్వి సుకన్య పౌరాణిక పద్య నాటక పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. పౌరాణిక నాటక ప్రదర్శనలు ఖర్చుతో కూడుకున్న నేపథ్యంలో నాటక రంగం తెరమరుగు అవుతోందని అన్నారు. అయినప్పటికీ అనేక మంది నటులు, కళాకారులు పౌరాణిక, నాటకాల ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, నాటక సమాజాలు ముందుకు రావాలని కోరారు. సజీవ కళైన నాటకాన్ని ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారని అన్నారు. తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పుస్తకావిష్కర్త అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ నూరు వసంతాల రంగస్థల నాటక చరిత్రను విశ్లేషించారు. కార్యక్రమంలో కవి నందిరాజు విజయకుమార్, బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు తిమ్మన శ్యాంసుందర్, పద్య కవి పోలాసం వీరాంజనేయులు, భాగీ కృష్ణమూర్తి, రచయిత శంభు ప్రసాద్, బీరం సుందరరావు, వంగర శ్రీధర్, బత్తుల బ్రహ్మారెడ్డి, షేక్ బాబావలి, కౌండిన్య, శాంతారాం, హరిబాబు పాల్గొన్నారు.

స్మశాన స్థలం పరిశీలిస్తున్న తహశీల్దారు పద్మావతి

స్మశానం ఆక్రమణపై కేసు నమోదు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బూదవాడ గ్రామంలోని దళిత కాలనీకి చెందిన స్మశానం స్థలం ఆక్రమణపై సోమవారం కేసు నమోదు చేసినట్లు రేణింగవరం ఎస్ఐ కెకె తిరుపతిరావు తెలిపారు. స్మశానం స్థలంచుట్టూ గత సంవత్సరం కొలిచి రెవెన్యూ అధికారులు హద్దురాళ్ళు పాతారని తెలిపారు. అయితే స్మశానం చుట్టూ ఉన్న హద్దురాళ్ళను పీకేసి స్థలాన్ని ఆరుమల్ల రవి అనే యువకుడు ట్రాక్టర్‌తో దున్నేశాడని తెలిపాడు. ఈ విషయమై దళిత కాలనీకి చెందిన కొంతమంది తహశీల్దారు పద్మావతికి ఫిర్యాదు చేశారని తెలిపారు. తహశీల్దారు స్మశాన స్థలాన్ని పరిశీలించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జనార్ధన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆర్‌టిఐ చట్టంతో సంస్కరణలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ జనార్ధన్

ప్రజాశక్తి-వేటపాలెం

అనేక సంస్కరణలకు సమాచార హక్కు చట్టం దోహద పడిందని రాష్ట్ర సమాచార కమిషనర్ సామెల్ జనార్ధన్ అన్నారు. సోమవారం ఆయన ప్రముఖ ప్రిన్సిపాల్ పొగడదండ రవికుమార్ ఇంటికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పార్లమెంటు ద్వారా అమలులోకి వచ్చి 18 సంవత్సరాలు గడిచింది అన్నారు. ప్రజలకు అత్యంత పారదర్శకంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల సమాచారం కచ్చితంగా ప్రజలకు అందించబడుతుందని చెప్పారు. సమాచారం అందించడంలో నిర్లక్ష్యం గా వ్యవహరించిన అధికారులకు సైతం పెనాల్టీలు విధిస్తున్నామన్నారు. సంవత్సర కాలంలో 500 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. చీరాల పట్టణంలో ఉన్న నాన్ గవర్నమెంట్ సివిల్ సొసైటీలో సమాచారం విధివిధానాల గురించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి సమాచార చట్టం యొక్క ఉద్దేశం అవసరం అమలు విధానాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం రెవిన్యూ, విద్య, నీటిపారుదల ,వర్క్ బోర్డ్, మైనార్టీ శాఖల కేసులు తను పరిష్కారాన్ని కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముందుగా పొగడదండ రవికుమార్, హరిణి దంపతులు కమిషనర్ని దుశ్శాలువాతో, పూలదండలతో ఘనంగా సత్కరించారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

- అధికారులకు జెసి కె.శ్రీనివాసులు ఆదేశం - డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్పందనలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దష్టి పెట్టాలని సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో "స్పందన", "డయల్ యువర్ కలెక్టర్" కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో సుమారు 260 అర్జీలు వచ్చాయన్నారు. పిటిషన్లు రీఓపెన్ కాకుండా చూడాలని, స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దిష్ట వ్యవధిలోగా కచ్చితంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్జీలను పరిష్కరించడంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. ఒకే సమస్యపై కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దని అధికారులను ఆయన ఆదేశించారు. పరిష్కరించలేని అర్జీలను వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని సంయుక్త కలెక్టర్ హెచ్చరించారు.

అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

'డయల్ యువర్ కలెక్టర్'కి విశేష స్పందన

ముందుగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. వీటిపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో జెసి మాట్లాడారు.

- పెద్దారవీడు మండలం, తోకపల్లి గ్రామం నుంచి కె. వెంకటేశ్వర్లు ఫోన్ చేసి తమ భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని జెసిని కోరారు. ఈ సమస్యపై సంయుక్త కలెక్టర్ స్పందిస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించాలని పెద్దారవీడు మండల తహశీల్దార్ ను ఆదేశించారు.
- కనిగిరి మండలం తుమ్మగుంట గ్రామం నుంచి వి.శివకష్ణ ఫోన్ చేసి సర్వే నెంబర్ 240-3లో ఉన్న తమ భూమిని ఆక్రమించారని, తమకు న్యాయం చేయాలని జెసికి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై సంయుత్తు కలెక్టర్ స్పందిస్తూ, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని కనిగిరి మండల తహశీల్దార్‌ను ఆయన ఆదేశించారు.
- పొదిలి మండలం నవమిట్ట నుంచి కె.బాదుల్లా ఫోన్ చేసి తమ భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయడంలేదని ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై జెసి స్పందిస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించాలని పొదిలి మండల తహశీల్దార్ ను ఆదేశించారు.
- అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామం నుంచి బి.లింగన్న ఫోన్ చేసి తమ పొలంలోకి వెళ్లడానికి దారి లేదని, దారిని ఇప్పించాలని జెసిని కోరారు. సమస్యపై సంయుక్త కలెక్టర్ స్పందిస్తూ, ఈ విషయాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని అర్ధవీడు మండల తహశీల్దార్‌ను ఆదేశించారు కార్యక్రమంలో డిఆర్ఒ ఆర్. శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, లోకేశ్వరరావు, వరకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

- గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌పై పర్యవేక్షణ పెంచాలి - జేసీని కోరిన సిపిఎం ప్రతినిధులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తుపాన్ కారణంగా పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని, ఊడి పోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటుకు తక్షణమే మరమ్మతులు చేయాలని సిపిఎం నేతలు కోరారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో సోమవారం ఈ విషయమై జేసీకి సిపిఎం ప్రతినిధి బందం వినతిపత్రం అందజేసింది. సిపిఎం నేతలు మాట్లాడుతూ తుపాన్‌తో పొగాకు, మిర్చి, శనగ, కంది, అరటి, బొప్పాయి తోటలు, బొబ్బర్లు, వరి వంటి పంటలు నీటమునిగి రైతులు నష్టపోయారన్నారు. నష్టపోయిన పంటలకు ఎన్యుమరేషన్ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దెబ్బతిన్న రహదారులు, మురికినీటి కాల్వలకు వెంటనే మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో గేట్లు ఊడిపోతున్నాయని, పర్యవేక్షణ పెంచి ప్రాజెక్టును కాపాడి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని కోరారు. సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జేసీని కలిసిన సిపిఎం ప్రతినిధి బందంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు జి.రమేష్, వి.బాలకోటయ్య, కె.రమాదేవి ఉన్నారు.

జేసీకి అర్జీ ఇస్తున్న సిపిఎం నాయకులు

పంట నష్టానికి

ప్రజాప్రతినిధుల వైఫల్యమే కారణం

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజాప్రతినిధులు, అధికారులు ముందు చూపు లేకుండా పంట కాలువలు, మురికి కాలువలకు మరమ్మత్తులు చేయకపోవడం వల్లే రైతులు తీవ్రమైన పంట నష్టానికి గురయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పేర్కొన్నారు. జిల్లాలో మురుగుకాలువలు మరమ్మతు చేయించాలని కోరుతూ జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. తుపాను నష్టం ఒక భాగం అయితే మరోవైపు అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుచూపు లేకుండా మురుగుకాలువలు బాగు చేయకపోవడంతో అధిక వర్షాలకు పంట పొలాల్లో వరద నీరు బయటకు వెళ్లే మార్గం లేక తీవ్రమైన నష్టం జరిగిందన్నారు. దీనికి రాష్ట్రప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా మురుగు కాలువలను మరమ్మతులు చేయించి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలన్నారు. జరిగిన పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి.. రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. అధిక వర్షాల వల్ల అనేకమంది పేదల నివాస గహాలు నీటమునిగాయన్నారు. నీట మునిగిన కొన్ని ప్రాంతాలకు మాత్రమే అధికారులను పంపి ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేయిస్తున్నారని చెప్పారు. నిత్యావసర సరుకులు కొన్ని చోట్ల పంపిణీ చేశారని, జిల్లా వ్యాప్తంగా నీటమునిగిన ప్రతి ఇంటికీ నిత్యావసర సరుకులు, రూ.2,500 నగదు ఇవ్వాలని కోరారు. తుపాను కారణంగా జిల్లాలో చేనేత మగ్గాలు దెబ్బతిని ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్, నాయకులు కొండయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యల్లో మొదటి స్థానంలో రాష్ట్రం

- ఈ ఘనత సీఎం జగన్‌దే..

- మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా కనిగిరి మండలం పునుగోడులో దెబ్బతిన్న వరి, మిర్చి పంటలను, బొమ్మిరెడ్డిపల్లిలో మిర్చి పంటలను సోమవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి.. ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు అడకస్వాములు, మాలపాటి ఓబుల్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, నారపరెడ్డి వెంకట రెడ్డి, అచ్చాల రవి, బాలు ఓబుల్‌రెడ్డి, ఇంద్ర, భోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

14న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో కరువు, మిచౌంగ్ తుపాన్‌తో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మీడియా సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎస్ స్వామి, సిపిఎం నాయకులు బాలకోటయ్య, సిపిఐ (న్యూ డెమోక్రసీ) నాయకులు ఆర్ మోహన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, వడ్డే హనుమారెడ్డి, సిపిఐ(ఎంఎల్) నాయకులు ఎం ఎస్ సాయి, ఎస్.లలిత కుమారి పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా

నష్టపరిహారం చెల్లించాలి

కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి వినోద్‌బాబు

ప్రజాశక్తి-బాపట్ల

మిచాంగ్ తుపాన్ నష్టపోయిన రైతు, కౌలు రైతులకు ఈ-క్రాప్ బుకింగ్‌తో సంబంధం లేకుండా నష్టపరిహారం ఇవ్వాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.వినోద్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌బాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడుతూ జిల్లాలో వరి, అరటి, మినుము, శనగ, మిర్చి, పొగాకు పంటలకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. తడిసిన ధాన్యాన్ని బస్తా రూ.1700కు కొనుగోలు చేయాలన్నారు. పంట నష్టం ఎన్యుమరేషన్‌ను వెంటనే పూర్తి చేసి.. రైతు, కౌలు రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, చేనేత నాయకులు ఎం.సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.సుబ్బారావు పాల్గొన్నారు.

జేసీకి విన్నవిస్తున్న రైతు నాయకులు

తుపాను కారణంగా

3.33 లక్షల ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తుపాను కారణంగా బాపట్ల జిల్లా రైతులు అపారంగా నష్టపోయారు. తుపాను వచ్చి వారం రోజులు గడుస్తున్నా.. నేటికీ మాగాణి, మెట్ట పైర్లు నీట మునిగి ఉన్నాయి. ముఖ్యంగా లక్షల ఎకరాల్లో వరి పైరు వరదనీటిలో మునిగిపోయింది. అన్ని రకాల మెట్ట పైర్లు కూడా దెబ్బతిన్నాయి. మొన్నటివరకు నీరు అందక పంటను నష్టపోయిన రైతులు నేడు పంట చేతికి వచ్చే దశలో తుపాను కారణంగా భారీవర్షాలతో వరదలు వచ్చి రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లింది. తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో 168 గ్రామాలకు చెందిన 1,84,488 మంది రైతులు నష్టపోయారు. సదరు రైతులకు చెందిన వివిధ పంటలు నీటమునిగి 3,33,300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో 1,98,535 ఎకరాల్లో వరిపైరుకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, శనగ, మినుము, పొగాకు, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ.. పలు ఇతర రకాల పంటలకు 1,34,765 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. జిల్లాలో ప్రధానంగా అమృతలూరు, బాపట్ల, భట్టిప్రోలు, చెరుకుపల్లి, చినగంజాం, చీరాల, కర్లపాలెం, కొల్లూరు, నగరం, నిజాంపట్నం, రేపల్లె, చుండూరు, వేమూరు మండలాల్లో వరి పైరుకు అధికంగా నష్టం వాటిల్లింది. చీరాల మండలంలో మినుము, ఇంకొల్లు మండలంలో శనగకు అధికంగా నష్టం వాటిల్లింది. జిల్లాలో మొత్తంగా వ్యవసాయ పంటలకు రూ.149 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలు పంపారు.

20,223 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు నష్టం

తుపాను కారణంగా జిల్లాలో 20,223 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లింది. మిరప, అరటి, పసుపు, కూరగాయలు, పూలతోటల రైతులు అపారంగా నష్టపోయారు. జిల్లాలో 38,961 ఎకరాల్లో పలురకాల ఉద్యానవన పంటలు సాగు చేయగా తుపాను కారణంగా 20,223 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. రూ.14 కోట్లా 64 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలు పంపారు.

'ప్రకాశం'లో 67,675 ఎకరాలలో..

ఒంగోలుబ్యూరో: తుపాను వల్ల కురిసిన భారీవర్షాలకు జిల్లాలో 67,675 ఎకరాలలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. ప్రాథమికంగా ఎన్యూమరేషన్‌ను ప్రారంభించారు. వర్షాలకు మొత్తం 14 రకాల పంటలు దెబ్బతిన్నాయి. బాధిత రైతులు 15,562 మంది ఉన్నట్లు గుర్తించారు. అత్యధికంగా పొగాకు 14056 హెక్టార్లలో దెబ్బతింది. పొగాకు నష్టపోయిన రైతులు 7700 మంది తేలారు. శనగ 3637 హెక్టార్లు, వరి 5822 హెక్టార్లు, మొక్కజొన్న 2612 హెక్టార్లు, జొన్న 670 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. పూర్తిస్థాయి ఎన్యూమరేషన్ ఈ నెల 18న పూర్తిచేస్తామని జేడిఏ శ్రీనివాసరావు తెలిపారు. 22 నాటికి ఆర్థికపరమైన అంచనాలు పూర్తవుతాయన్నారు. తుది జాబితాను ఈనెల 26న కలెక్టర్ ఆమోదంతో ఖరారు చేస్తామని జేడిఏ తెలిపారు.

ప్రభుత్వ భూములు

ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

ఎస్‌పికి ప్రజాసంఘాల నేత ఫిర్యాదు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

కనిగిరి పట్టణంలో ప్రభుత్వ, వాగు పొరంబోకు భూములను ఆక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పికి ప్రజాసంఘాల నేతలు నాలుగు ఫిర్యాదులు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్య వేదిక కనిగిరి పట్టణ కన్వీనర్ పిసి కేశవ మాట్లాడుతూ అసైన్డ్ భూములను ఆక్రమించి అనధికారిక లేఅవుట్లు వేసి ప్రజలను మోసం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేవాంగనగర్‌లో దారిని ఆక్రమించి, నివాసితులను ఇబ్బంది పెడుతున్న వారిపై సిట్ ద్వారా విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కనిగిరిలో జరుగుతున్న భూదందాలపై ప్రత్యేక అధికార నియమించి ప్రభుత్వ భూములను రక్షించాలన్నారు. సామాన్యులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్‌పి స్పందిస్తూ ఫిర్యాదులను సమగ్రంగా విచారించి దోషులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.